క్లుప్తంగా

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



విలసవిల్లిలో ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్ర స్వామివారు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో ఉన్న రామాలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పండితులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యోగాసనాలు వేశారు.. చదరంగం ఆడారు



అమలాపురంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు

అమలాపురం టౌన్: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు యోగా, పుస్తక పఠనం, పలు సంప్రదాయ ఆటల్లో ఆయా రంగాల నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకూ ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌కే వర్మ తెలిపారు. యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ విద్యార్థులకు యోగాపై శిక్షణనిచ్చారు. అష్టాచమ్మా ఆట ఆడించారు. చదరంగం నేర్పించారు. కథలు వినడం, విన్న కథలను రాయడం, ఆదర్శ పురుషుల గ్రంథాలు చదవడం వంటి అంశాల్లో తర్ఫీదునిచ్చారు. గ్రంథాలయ నిర్వాహకుడు పోలిశెట్టి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో శిక్షణా తరగతులు జరుగుతున్నాయి.

చిన్నారులకు వ్యాసరచన పోటీలు



తాళ్లరేవు సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

తాళ్లరేవు: స్థానిక ప్రజా సంఘాల భవనంలో చిల్డ్రన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో చిన్నారులకు దేశభక్తి గీతాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు దేశభక్తి గీతాలను ఆలపించారు. సుమారు 50 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఉపాధ్యాయురాలు అనంతలక్ష్మి, వీవోఏ సంఘం అధ్యక్షురాలు కమిడి ఈశ్వరీబాయి, వెదురుపావులూరి నాని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, పాలిక శ్రీనివాస్, పులపకూర కృష్ణ పాల్గొన్నారు.

కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం




బండారులంకలో వెంకన్న రథోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. బిళ్లవారి వీధి నుంచి ప్రారంభమైన రథోత్సవం ఎగ్జిబిషన్ వీధి, వీరభద్రస్వామి గుడి సెంటర్, హైస్కూల్ సెంటర్, మురుగులమ్మ గుడి సెంటర్ మీదుగా కాపటి వీధి, శివాలయం వీధి వరకూ సాగింది. రథోత్సవంలో దారి పొడవునా అధిక సంఖ్యలో మహిళలు ఎదురొచ్చి మంగళ హారతులు పట్టారు. రథోత్సవంలో ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమ భారతి, చందన శంకరరావు, జాన గణేష్, శ్రీనివాస బాలమిత్ర సంఘం ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం గిరి, కాసిన ప్రసాద్, బళ్ల సత్తిరాజు పాల్గొన్నారు.

క్షణమొక యుగంలా ఎదురుచూపులు

- ఓట్ల లెక్కింపు రోజుపైనే అందరి దృష్టి
- ఏ నలుగురు కలిసినా ఎన్నికల ఫలితాల ఊసులే



అమలాపురం టౌన్: అమలాపురం, ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులే కాదు, ఓట్లేసిన ఓటర్లు కూడా వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు రోజు కోసం ఒళ్లంతా కళ్లు చేసుకుని ఎదురు చూస్తున్నారు. రెండు నియోజకవర్గాల్లోనూ ఏ నలుగురు కలిసినా మాటలన్నీ ఎన్నికల ఫలితాల ఊసులే అవుతున్నాయి. విజయం తమదంటే తమదన్న వాదన రెండు పార్టీల అభ్యర్థుల మధ్య సాగుతుంది. అయితే జిల్లాలో అత్యంత కీలకమైన ఈ రెండు నియోజకవర్గాల్లో వార్ వన్ సైడేనని రాజకీయ విశ్లేషకులు సైతం బలంగా చెప్పలేకపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనంత పోటీ ప్రస్తుత ఎన్నికల్లో నెలకొందని, పైగా ఈ దఫాలో ఓటరు నాడి సైతం ఎవరికీ అంతుబట్టడం లేదన్న చర్చ సర్వత్రా సాగుతుంది.

ఎవరి ధీమా వారిదే

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఓ మున్సిపాలిటీ, ఓ నగర పంచాయతీతో పాటు 127 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటికే వైఎస్సార్ సీపీ అభ్యర్థులైన మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు ఏఏ గ్రామాల్లో ఎంతెంత ఓటింగ్ నమోదైంది, ఎంత మేర తమకు ఓట్లు పడ్డాయో అంచనాలు వేసుకుని ఎక్కడెక్కడ ఎంత మెజార్టీ వస్తుందో లెక్కలు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులతో పాటు కార్యకర్తలు సైతం తమ అధినేత జగన్ చేసిన మంచి పనులే దీవెనలై అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేశారన్న విశ్వాసం, నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ప్రత్యర్థి పార్టీకి చెందిన అభ్యర్థులైన అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబులైతే అసలు లెక్కలే అవసరం లేదని, కూటమి బలంతో తమ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలైతే రెండు నియోజకవర్గాల్లో సోషల్ మీడియాలో తమకు అనుకూలంగా వస్తున్న రీల్స్, మెసేజీలు చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీయేనా!

రెండు నియోజవర్గాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థుల మధ్య హోరాహోరీ పోటీ(నెక్ టు నెక్) జరిగిందని రాజకీయ విశ్లేషకులంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. ఎవరు గెలిచినా 2,000 నుంచి 6,000 వేల ఓట్ల మెజార్టీతోనే గెలవొచ్చని స్పష్టం చేస్తున్నారు. పైగా ప్రధాన పోటీదారుల మధ్య ఓటింగ్ శాతంలో వ్యత్యాసం సైతం ఎక్కువ ఉండదన్నది వారి అంచనా.. కూటమి ప్రభావంతో మూడు పార్టీలు కలిశాయి కాబట్టి ఈసారి విజయం తమదేనని రెండు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, ప్రజలకు చేరిన సంక్షేమ ఫలాలు, అన్నింటికి మించి ముఖ్యమంత్రి జగన్‌పై ఉన్న నమ్మకం, విశ్వాసంతో తమను మళ్లీ విజయాన్ని అందిస్తాయని వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. పైగా సైలెంట్ ఓటింగ్ తమకు అనుకూలమంటే తమకే అనుకూలమని ఇరు పార్టీల అభ్యర్థులు వాదిస్తున్నారు. ఈ స్పష్టత కోసమే వచ్చే నెల 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు కోసం అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలి



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎం.సురేష్ తదితరులు

ముమ్మిడివరం: విద్యార్థులందరికీ మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు జిల్లా ఎడిషనల్ డైరెక్టర్ ఎం.సురేష్ సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కర్‌ల అధ్యక్షతన మండలంలోని 78 పాఠశాలలకు చెందిన మధ్యాహ్న భోజన పథకం కుక్, హెల్పర్లలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పూజిత, టి.తులసి, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి సర్వసభ్య సమావేశం



మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కాట్రేనికోన: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన ఎన్నికల నిబంధనలకు లోబడి జరిగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా శాఖాపరమైన రివ్యూలను నిర్వహించలేదు. వేసవి నేపథ్యంలో మండలంలో నెలకొన్న మంచినీటి సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, జూన్ 6 తరువాత మంచి నీటి సమస్యల పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. తనకు ఆహ్వానం అందని కారణంగా సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైనట్లు జెడ్పీటీసీ సభ్యుడు నేలకిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మోకా చంద్ర నాగరత్నం, సంగాని మునేంద్ర వర్మ, కోలాటి సత్యవతి, ర్యాలి వీరబాబు, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, మల్లాడి వీర బాబ్జి, మల్లాడి ఏడు కొండలు, ఓలేటి మంగాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రమణ్యం, అంగన్ వాడీ సూపర్‌వైజర్ ఎల్‌వీ రమణి తదితరులున్నారు.

అధిక ఫీజు వసూలుదారులపై చర్యలు తీసుకోవాలి

యానాం: నీట్, నాన్‌నీట్ కోర్సులైన ఇంజినీరింగ్, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్, నర్సింగ్ తదితర కోర్సులు నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, అటువంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పుదుచ్చేరి స్టేట్ స్టూడెంట్స్ అండ్ పేరెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు వి.బాలసుబ్రహ్మణ్యన్ కోరారు. ఫీజు నిర్ధారణ కమిటీ చైర్మెన్, మాజీ న్యాయమూర్తి ఎస్.కందమ్మాళ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొన్ని కళాశాలలు హయ్యర్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరక్టరేట్ నిర్ణయించిన వాటికన్నా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల తరహాలో పుదుచ్చేరిలో మోనిటరింగ్ కమిటీ, గ్రీవెన్స్ కమిటీ లేకపోవడంతో ఫీజు సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్రగ్స్‌ను అరికట్టడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం విఫలమైంది

యానాం: డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం విఫలమైందని ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు వైథిలింగం విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటుపడిన కొంతమంది ఇటీవలి పుదుచ్చేరిలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టడమే కాకుండా ఆమెను హత్యచేసిన మురుగుకాలువలో పడేశారన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర వదలడం లేదని ఆరోపించారు. స్కూల్, కళాశాల విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. డ్రగ్స్ అరికట్టడంపై డీజీపీ, ఎల్జీ మాట్లాడుతున్నారు తప్ప మిగిలివారు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

మండపేట: పట్టణంలోని 21వ వార్డు రావులపేట వీధిలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. ఇక్కడి రామాలయం ఎదురుగా ఉండే వీధిలో నివాసం ఉంటున్న తొగర దొరబాబుకు చెందిన యాక్టివ్ మోటార్ సైకిల్‌ను అర్ధరాత్రి ఎవరో అపహరించుకు పోయారు. బైక్ యజమాని దొరబాబు ఆ రోజు రాత్రి తన పని ముగించుకుని ఇంటి ఎదురుగా పార్క్ చేసి ఉంచానని చెప్పారు. ఉదయం లేచి చూసేసరికి తన బైక్ కనిపించకుండా పోయిందన్నారు. దీనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ముమ్మిడివరం: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు 101వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, తాడి నరసింహరావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి వెంకట రమణకుమార్, గుద్దటి జమి, పొత్తూరి విజయ భాస్కరవర్మ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

తాళ్లరేవు: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెసింగి ఈశ్వరరావు, ఎంజీ సూర్యనారాయణ, పి.రామలక్ష్మి, రోళ్ల చక్రవర్తి, వాడ్రేవు వీరబాబు, జక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక వినియోగంతో అనర్థమే

- విచ్చలవిడిగా రసాయనాల వినియోగంతో పంటలు విషతుల్యం
- సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు



గొల్లపాలెంలో ట్రాక్టర్‌తో పశువుల పెంట పొలానికి తరలింపు

కాజులూరు: రోజురోజుకి వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోతోంది. ఒకప్పుడు కేవలం సేంద్రియ ఎరువులనే వినియోగించి పంటలు సాగు చేసే రైతన్నలు క్రమేపి అధిక దిగుబడి కోసం అధిక మోతాదులో రసాయన ఎరువులను వినియోగించడం ప్రారంభించారు. తెగుళ్లు, పలు రకాల పురుగుల నివారణతోపాటు పంట ధృడంగా పెరగడానికి, చివరకు కలుపు మొక్కల నివారణకు కూడా రసాయనిక మందులనే వినియోగిస్తున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పంట విషతుల్యంగా మారి ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాము పండిస్తున్న ఆహారం కలుషితమవ్వకూడదనే ఉద్దేశంతో నియోజకవర్గ గ్రామాల్లోని కొందరు రైతులు ఇటీవల సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి పెడుతున్నారు. తమ పశువుల శాలలోని పశువుల పేడ, చీకినగడ్డి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై తెచ్చి పొలాల్లో వేస్తున్నారు. సొంతంగా పశువులు లేని రైతులు కోళ్లఫారాల్లోని కోడిపెంట, చెరువులు, కుంటల్లోని పూడికమట్టిని కొనుగోలు చేసి మరీ పొలాల్లో వేస్తున్నారు. నియోజక వర్గ పరిధిలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన అనేక మంది రైతులు సేంద్రియ సాగు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి

సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరిగి అధిక దిగుబడితోపాటు ఆరోగ్యకర పంటలు లభిస్తాయని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పంటపొలాల్లో చీడపీడలు, తెగుళ్ల తక్కువగా ఉంటాయన్నారు. పూడికమట్టి, పశువుల పేడల్లో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ పోషక విలువలు లభించడంతో పైర్లు పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. రైతులు రసాయనిక ఎరువుల తగ్గించి సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట వాడకంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.



మొగలిపాలెంలో పశువుల పెంటను ఎడ్లబండిపై తెచ్చి పొలంలో వేసుకుంటున్న రైతు

జాస్‌తో సంపూర్ణ ఆరోగ్యం



కలవచర్లలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



చింతలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, కిశోర బాలికలు

ఆలమూరు: రాష్ట్రంలోని గ్రామీణ పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) పేదలకు సంపూర్ణ ఆరోగ్య రక్షణకు తోడ్పాటును అందిస్తుందని ప్రత్యేక వైద్య నిపుణులు జి. దుర్గా ప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. కలవచర్లలో మంగళవారం జాస్ పేజ్-2 కార్యక్రమం జరిగింది. పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సాయి కిషోర్ నేతృత్వంలో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 187 మందికి వైద్య సేవలను అందించి, మందులను అందజేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారిని ఆరోగ్యశ్రీ పథకం క్రింద రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.వేణి, సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, సీహెచ్ మౌనిక, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఏఎన్ఎం కె.రాణి, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

ఆలమూరు: కిశోర బాలికలు ఋతుక్రమ సమయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని సంపూర్ణ ఆరోగ్య రక్షణ పొందాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లిఖార్జున, డి.సాయికిషోర్ అన్నారు. ఋతుక్రమం ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీల ఆధ్వర్యంలో ప్రపంచ కిశోర బాలికల సదస్సులను ఏర్పాటు చేశారు. కిశోర బాలికలు పాటించాల్సిన నియమాలను వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కిశోర బాలికల సౌకర్యార్థం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. అనంతరం ఆయా వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పరిధిలో కిశోర బాలికలతో కలిసి వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించారు. హెచ్‌వీలు పి.ఉమ, ఆర్.బాలామణి, ఎంఎల్‌హెచ్‌పీలు వి.సువర్చల, సీహెచ్ మౌనిక, కె.కళాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో విద్యార్థుల సేవలు అమూల్యం

అయినవిల్లి: ఎన్నికల్లో విద్యార్థులు అందించిన సేవలు అమూల్యమని స్థానిక ఎస్సై బి.రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎన్నికల్లో విధులు నిర్వహించిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, రూ.500 చొప్పున అందజేశారు. సామాజిక కార్యక్రమాల్లోను విద్యార్థులుగా అందిస్తున్న సేవలు ఎస్సై రాజేష్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసుస్టేషన్ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్, గౌరవవేతనం అందిస్తున్న ఎస్సై

30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాళ్లరేవు: ఈ నెల 30వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.ప్రభాకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఘనంగా గ్రామ దేవత జాతర



ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెంలో వేంచేసి ఉన్న ఆదిలక్ష్మి అమ్మ వారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసి, నైవేద్యాలు చెల్లించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అన్నసమారాధన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం



పోలేరమ్మ అమ్మవారు

అమలాపురం రూరల్: మండలంలోని సమనస గ్రామదేవత పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా గ్రామ వీధుల్లో ఊరేగింపుగా అమ్మవారి సంబరాన్ని జరిపారు. శుక్రవారం అమ్మవారి సంబరం, సోమవారం జాతర నిర్వహించనున్నారు. వచ్చే నెల 3న అన్నసమారాధన, 4న తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా పల్లాలమ్మ అమ్మవారి జాతర



గాడిలంక పల్లాలమ్మ అమ్మవారు

ముమ్మిడివరం: గాడిలంక గ్రామ దేవత పల్లాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన జరిగింది.

దుర్గమ్మ గుడిలో హుండీ అపహరణ

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రుపాలెం చాకిరేవుచెరువు వద్ద ఉన్న లక్ష్మీదుర్గ ఆలయంలో హుండీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని ఎత్తుకెళ్లిపోయారు. సొమ్ము తీసుకుని ఖాళీ హుండీని ఆలయానికి వెనక ఉన్న పంట కాలువలో పడేశారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున 1.15 గంటలకు ముగ్గురు వ్యక్తులు హుండీ దొంగిలించినట్లుగా ఆలయ సీసీ కెమెరాలో రికార్డైంది. దొంగిలించిన హుండీలో రూ.20 వేల నగదు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

అలరించిన బాలల భక్తి సంకీర్తనలు

అమలాపురం టౌన్: స్థానిక రోటరీ కల్యాణ మండపంలో జరుగుతున్న రోటరీ యువజన వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సాయంత్రం బాల బాలికలకు భక్తి సంకీర్తల పోటీలు జరిగాయి. దాదాపు 70 మంది బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొని భక్తి గీతాలను రాగయుక్తంగా ఆలపించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మట్టపర్తి చంద్రశేఖర్, సత్తిబాబు, కృష్ణ బినతి వ్యవహరించారు. పోటీలను రోటరీ యువజన వారోత్సవాల నిర్వహణ కమిటీ చైర్మన్ ఆకొండి పవన్ పర్యవేక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి నాగ భూషణం, కార్యదర్శి శ్రీఘాకోళపు రామ సతీష్, కోశాధికారి కూచిమంచి శేఖర్ శ్రీరామ్ తదితరుల ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతున్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలో రహదారి వివాదం కారణంగా అటుగా వెళ్లే మార్గం లేక ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి మరీ పోలీసు భద్రత నడుమ ఓటు హక్కు వినియోగించుకున్న లలితకుమారి కుటుంబ సభ్యులను సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మంగళవారం పరామర్శించారు. సామాజిక వెలివేత పేరుతో కొందరు సదరు కుటుంబాన్ని వేధించడం తగదన్నారు. పరామర్శించిన వారిలో వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరపతిరావు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు తదితరులున్నారు.

కొమరగిరిపట్నంలో మెగా వైద్య శిబిరం

అల్లవరం: ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సహకారంతో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి పర్యవేక్షణలో కొమరగిరిపట్నం బైర్రాజు ఫౌండేషన్ ప్రాంగణంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పీఎస్ శర్మ హైపర్ టెన్షన్‌పై అవగాహన కల్పించారు. రోగులకు ఈసీజీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాట్ల గోపిరాజు, నడింపల్లి వెంకటరామరాజు, జంపన సుమన్‌వర్మ, జీవీఎస్ మల్లిబాబు, చిక్కాల సతీష్, గుర్రాల రామకృష్ణ పాల్గొన్నారు.